# బ్లో అవుట్

మొహంలో మంట,
నోటి జోరూ–వెరసి
కోపమొచ్చిన కాంతం దేవర్లంక
బ్లోఅవుట్‌లా వుంది!



డా. పైడిపాల

“ఇంత జరిగిన తర్వాత ఆ ఇంట్లో పెళ్లికెళ్లడానికి సిగ్గుండాలి. నేను మాత్రం చచ్చినా రాను. మీ కంత తీపిగావుంటే వెళ్లండి–వచ్చిన తర్వాత నా శవాన్ని చూద్దురుగాని ...”

తీరా పెళ్లి కెళ్దామనుకొంటుండగా కాంతం పంతం, హెచ్చరిక – నాకు ఆందోళన కలిగించాయి. అయిదారు వారాల క్రితం ఆ ఇంటికి వెళ్లితీరాలని పట్టుబట్టిన కాంతం ... ఇప్పుడు ససేమిరా, వీల్లేదనడం ...!

* * *

మా ఇంట్లో కుక్కలూ, ఇంటి ముందు ‘కుక్కలున్నాయి జాగ్రత్త’ మార్కు బోర్డులూ–లేకపోయినా సాధారణంగా మా ఇంటికి తెలిసిన వాళ్లెవరూ రారు. కారణం మా కాంతం అంటే వుండే భయం. కాంతం ఏ ప్రయోజనం లేనిదే ఎవర్నీ మర్యాద మిగిలేలా ఇంటికెలా రానివ్వదో అలాగే ఎవరింటికీ ఊరికే వెళ్లడానిక్కూడా ఇష్టపడదు. అలాంటి కాంతం బ్లో అవుట్ చూద్దానికి వెళ్దామని పట్టుబట్టడం నా కాశ్చర్యాన్ని కలిగించింది.

‘పెట్రోలు మండిపోతోంది, బస్ మీద వెళ్లొస్తే మన ప్రిస్టేజికి లోటా?’ అని గొణిగే కాంతం స్కూటర్ మీద వెళ్దామని ప్రతిపాదించడం, దార్లో ముక్తేశ్వరం రేవు దగ్గర రామాఫలాలు అమ్ముతుంటే బేరమాడి ఏకంగా డజను కొనెయ్యడం ... అంతా ‘కలా లేక కాంతం లీలా!’ అనిపించింది.

“గోదావరిలో పైసలేసినట్టు రూ పళ్లను బ్లో అవుట్ మంటల్లోకి విసిరేసి ఆ అగ్నిదేవుణ్ణి కాని శాంతింపజేసేస్తావేమిటే?”

“ఆ ... చాల్లెండి మీ వేళాకోళం. అంత దూరం వెళ్లాక అమలాపురంలో రాఘవన్నయ్యగారింటికి వెళ్లకుండా వుంటామా? వెళ్తూ వట్టి చేతుల్తో వెళ్తామా?” ఇలా మాట్లాడుతోంది మా కాంతమే నన్న నిజాన్ని వెంటనే నమ్మలేకపోయాను నేను. రాఘవను నేను ఆత్మీయంగా ‘బావా’ అని పిల్చినా ... వరస దూరం. నా తరఫున రక్తసంబంధం వున్న బంధువులింటికే రాని కాంతం రాఘవగారింటికి వెళ్దామంటే ‘ఏదో వుంది’ అనిపించింది.

“బ్లోఅవుట్ వల్ల మాకేం ప్రమాదం లేదను కొంటున్నాం. ఇలా హఠాత్తుగా మీ ఇద్దరూ కలసి వచ్చారంటే – ఇక ముందు అలాంటిదేదో వుందన్నమాట!” గేటు దగ్గరే వున్న రాఘవ కూడా మమ్మల్ని చూడగానే అదే మాట అన్నాడు!

రాఘవ మాటల్లో ఆత్మీయతతో పాటు చిన్న చురక కూడా వుంది. ప్రతి సంసారంలో వుండే బియ్యంలో వడ్లగింజల్లాంటి చిన్న విషయాలకు నాతో గొడవపడి రచ్చకెక్కడం, తీరా

**జనం బ్లో అవుట్‌ని భూతంలా వర్ణించినా భూతద్దంలో చూపించినా – ప్రత్యక్షంగా చూసినపుడు మాత్రం అలా అనిపించలేదు**

పరిస్థితులు విషమించాక నా దగ్గర చనువుండే పెద్దలచేత నాకు నచ్చజెప్పించడం మా కాంతానికో హాబీ. గతంలో రెండు మూడు వ్యాపారాలు చేసి గట్టి దెబ్బలు తిని ఇటీవల ఆశ్చర్యంగా రొయ్యల చెరువుల్లో లక్షలు సంపాదించి హఠాత్తుగా చుట్టాల్లో ఎదిగిపోయిన రాఘవ కూడా మా కాంతం ఆశ్రయించిన సరికొత్త పెద్దమనిషి కావడం వల్ల స్కూల్లో పాఠాలు చెప్పే నేను ... అతని చేత పాఠాలు చెప్పించుకొని లోకువైపోయాను.

స్కూటర్ దిగగానే కాంతం చనువుగా లోపలకు వెళ్లిపోయింది. నేను మాత్రం అందమైన ఎలివేషన్‌తో ఆధునికంగా ఖరీదుగా కనిపిస్తున్న ఇంటికేసి కళ్లప్పగించి చూస్తున్నాను. ‘ఇల్లు కట్టిన తర్వాత ఇదే రావడమనుకొంటాను’ అంటూ ఆప్యాయంగా లోపలకు

తీసుకెళ్లాడు రాఘవ. ఫ్లోరింగూ, ఫర్నిచరూ .. వగైరా చూస్తుంటే బయటకంటె లోపల మరీ రిచ్‌గా వుంది.

'నేను విన్నదానికంటె గట్టిగా సంపాదించాడు' అనుకొన్నాను. కాంతం కూడా ఆ ఇంట్లో నాకేకాంతంగా తారసపడినపుడు చెవిలో అదే గుసగుసలాడింది.

"అదృష్టం అంటే వీళ్లదేనండీ ... ఇంటిని చూసినా ఇంట్లో వాళ్ల పద్ధతులు చూసినా ముచ్చటేస్తోంది. పెళ్లానికీ, పిల్లకీ చేయించిన నగలూ, తీయించిన బట్టలూ చూస్తుంటే కళ్లు చెదిరిపోతున్నాయి. ఈ సంవత్సరం చెరువుల్లో పెద్ద లాభాలు లేవటగానీ ... లేకపోతేనా! అన్నట్టు రాణికి ఈ సంవత్సరం పెళ్లి చేసేస్తారట. సంబంధాల కోసం చూస్తున్నారు. పదిలక్షలకు పైగా కట్నమిస్తారట. ఆ పైన సంపాదనంతా ఇద్దరాడపిల్లలకే కదా ..."

ఇంకా ఏదో చెపుతుండగా రాఘవ భార్య వచ్చింది.

"తలుపులిలా అదురుతున్నాయేమిటి వదినా?" అంటూ మాట మార్చింది కాంతం.

"ఓ అదా? బ్లోఅవుట్ భూతం మహిమ. కంగారుపడకండి" అందావిడ నవ్వుతూ.

జనం బ్లోఅవుట్‌ను భూతంలా వర్ణించినా, భూతద్దంలో చూపించినా - ప్రత్యక్షంగా చూసినపుడు నాకు మాత్రం అలా అనిపించలేదు! మా రాఘవ సూచన మేరకు మునిమాపు చీకట్లు ముసురుకొంటుండగా బ్లోఅవుట్ చూడ్డానికి నేను కాంతం అమలాపురం నుంచి స్కూటర్ మీద బయల్దేరాం. కోదూరుపాడు జంక్షన్ దాటేసరికే స్పష్టంగా కనిపించిన ఆ అరుదైన దృశ్యం చిత్రమైన అనుభూతినీ భయాన్నీ కలిగించింది. 'గుడ్డోడి చింత' దాటి అల్లవరం మొగలో స్కూటర్ పార్క్ చేసి తీర్థంలా వచ్చి చూస్తున్న జనంతోపాటు కాలువ గట్టు వెంట నడుస్తున్న కొద్దీ దగ్గరవుతున్న మంటలూ కళ్లకు మిరుమిట్లు గొలుపుతూ వెచ్చగా తగులుతున్నాయి. దగ్గరగా చూస్తే - భూదేవి ఆదిశక్తిలా నాల్కలు చాపి గర్జిస్తున్నట్టు ... పసుపు నారింజ రంగులు కలిసిన జ్వాలలు నింగినంటుతుంటే - వెయ్యి నయాగరాలు ఒకేసారి దూకుతున్న హోరు చెవులను బద్దలు కొడుతోంది. చుట్టూ వున్న కొబ్బరిచెట్లు ఆ బీభత్సాన్ని తెల్లమొహాలు వేసుకొని చూస్తున్నట్టున్నాయి. అంత భయానక వాతావరణంలోనూ కాలువలో ప్రతిబింబిస్తున్న అఖండజ్యోతి జ్వాలలు నా సౌందర్యదృష్టికి చక్కిలిగింతలు పెట్టాయి. ఒక్క మాటలో చెపితే అభిమన్యువధ ఘట్టంలో తిక్కన వర్ణించిన యుద్ధభూమిలా ఆ ప్రదేశం 'దారుణ ప్రియదర్శనం'గా వుంది!

తిరిగి వస్తుండగా అమలాపురం పొలిమేరల్లో కాంతం స్కూటర్ని ఆపమంది.

"మళ్లీ వెనక్కు వెళ్దామంటావా?"

"ఎప్పుడూ వెనకో అని తప్ప ముందుచూపు లేదు మీకు. అందుకే ఇలా ఏడుస్తున్నాం. ఇంత తగలేసుకొని ఇక్కడి కొచ్చింది ఈ మంటల్ని చూడ్డానికా? మగపెళ్లివాళ్లం గనుక లోకువ కాకుండా ఆ వంకతో వచ్చాం - అంతే"

"నువ్వంటున్నది? ..."

"అవునండీ. మన పెద్దాడికి రాణి నిమ్మని అడగండి. పిల్ల వందనంగా లక్ష్మీదేవిలా వుంది."

"మన పెద్దాడి కప్పుడే పెళ్లెందుకే? అయినా ఉత్త డిగ్రీ చదివిన మనవాడికేం చూసి ఇస్తారే ఆ పిల్లను?"

"మీ రెపుడూ ఇంతే. వెయ్యి అబద్ధాలాడైనా ఓ పెళ్లి చెయ్యమన్నారు. మనకింత మంచి సంబంధం తలకిందులా తపస్సు చేసినా రాదు... మీరడిగితే ఆయన కాదనరు..."

"సారీ. అబద్ధాలాడ్డం నావల్లకాదు. ఇప్పుడేం తొందరలేదు. మనకు తగ్గవాళ్లు ..."

"మీరెప్పుడు నామాట విన్నారు గనుక. మీ బావను చూసి నేర్చుకోండి. ఆవిడెంత చెపితే అంత. సర్లెండి. మీలాంటి చేతకాని మనిషిని అడగమనే కంటె - ఆ పని నేనే చేస్తాను. నాకు మాత్రం ఏం తక్కువ? ఉన్నవాళ్లిద్దరూ మగపిల్లలే..."

* డబ్బు లేకపోయినా ఫరవాలేదు. మంచి స్నేహితులు లేకుండా మాత్రం వుండకూడదు.

నామీద అలిగిన కాంతం - ఆ రాత్రి రాఘవ, అతని భార్య వుండగా - తనే విషయాన్ని కదిపింది.

"మా రాణి అదృష్టవంతురాలు గనుకే దానికి పెళ్ళీడొచ్చేసరికి ఇంత సంపాదించుకున్నాం. పెద్దమ్మాయి కెలాగూ గొప్ప సంబంధం చెయ్య లేకపోయాం. దీన్ని మాత్రం ఏ కలక్టరుకో, డాక్టరుకో ఇస్తాం కాని చిన్న ఇంట్లో పడెయ్యం" అని రాఘవ భార్య వసుమతి తెగేసి చెప్పింది.

ఆ వేటుకి మొహంలో నెత్తురుచుక్కలేని కాంతం మళ్లీ ఆ గడపతొక్కనని భీషణ ప్రతిజ్ఞ చేసి, బావుండదని నేనెంత చెప్పినా వినకుండా తక్షణం బయల్దేరేవరకు ఊరుకోలేదు!

నెల తిరక్కుండానే రాఘవ నుంచి శుభలేఖ వచ్చింది. వరుడు డాక్టరు! శుభలేఖ చూసిన కాంతం నేను చేతులారా పెన్నిధిని వదిలేశానని చిందులు తొక్కింది ...!

* * *

కాంతం తత్వానికి అలవాటుపడిన నేను కాంతంతో చెప్పకుండానే పెళ్లి రాత్రనగా - ఆ సాయంత్రం రాఘవగారింటికి వెళ్లాను.

వీధిగుమ్మం వరకు వెళ్లిన తర్వాత అనుమానం వచ్చింది - నేను దారి తప్పానేమో అని ...! అక్కడ పెళ్లిపందిరీ, తోరణాలు, లైటింగ్, మంగళవాద్యాలు ... ఆ సందడేమీ లేదు! ఆశ్చర్యపడి దిక్కులు చూస్తున్న నాకు పక్కింటివాళ్లు చెప్పారు.

'పెళ్లి రద్దయింది - రెండ్రోజుల క్రితం రాణి తను ప్రేమించిన అద్దెపుస్తకాల షాపు వాడితో లేచిపోయిందని!'

అందమైన పచ్చని కోనసీమలాంటిదని కాంతం భ్రమపడిన ఆ ఇంట్లో బ్లోఅవుట్! అనూహ్యమైన ఈ దుర్వార్త నన్నేకాదు - కక్షకట్టిన కాంతాన్ని కూడా కుదిపేస్తుందని చెమర్చిన నా కళ్లు చెప్పాయి!

బరువెక్కిన గుండెతో రాఘవకు కనిపించకుండానే వెనుదిరిగిన నాకు బ్లోఅవుట్ హోరు భయంకరంగా వినిపించింది. అటుకేసి చూశాను. ఆ మంటలు ఇంకా రగులుతూనే వున్నాయి! ●